
తుప్పుపడుతున్న ఓపెన్ జిమ్ పరికరాలు

- చిన్నారుల ఆట వస్తువులు సైతం..
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు





నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారిన ఓపెన్ జిమ్ పరికరాలు

కవాడిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఇందిరా పార్కులో చిన్నారుల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ వస్తువులు తుప్పుపట్టి నిరుపయోగంగా మారిపోయాయి. ఓపెన్ జిమ్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి శిధిలావస్థకు చేరాయి. ఆట వస్తువులు విరిగిపోయి ప్రమాదకరంగా మారి చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, ఆట వస్తువులు నిరుపయోగంగా మారుతున్నాయి.

నగరంలోనే ప్రతిష్టాత్మకమైన ఇందిరాపార్కుకు సందర్శకులు, చిన్నారులు, యువత అధిక సంఖ్యలో వస్తుంటారు. వీరి కోసం వివిధ రకాల క్రీడా, జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. ఐతే అవి కొద్ది రోజులు బాగానే పని చేశాయి. కానీ నిర్వహణ లేకపోవడంతో అవి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఆరోగ్యం, మంచి వాతావరణం ఉండటంతో నగర వ్యాప్తంగా ఉన్న ప్రజలంతా ఇందిరాపార్కుకు రావడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. నగరం నలుమూలల నుంచి ఇక్కడికి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు.

చిన్నారులకు నిరాశే..

ఇందిరాపార్కులో ఏర్పాటు చేసిన ఆటపరికరాలు అందుబాటులో లేకపోవడంతో చిన్నారులకు నిరాశ ఎదురవుతోంది. ఆటలు ఆడటానికి ఎంతో దూరం నుంచి పార్కుకు వస్తున్నప్పటికీ పరికరాలు సరిగా లేకపోవడంతో చాలా మంది నిరాశతో వెనుతిరుగుతున్నారు. తుప్పుపట్టిన ఆట వస్తువులను చూసిన తల్లిదండ్రులు పిల్లలను ఆడుకోనివ్వడం లేదు. వాటి కారణంగా ఏమైనా ప్రమాదం జరుగొచ్చునని ఆందోళన చెందుతున్నారు. ఆట పరికరాలు, ఓపెన్ జిమ్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యలను ఉన్నతాధికారులకు వివరిస్తా

ఇందిరాపార్కులో చిన్నారుల ఆట పరికరాలు, ఓపెన్ జిమ్ మరమ్మతుల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాను. పార్కులోని ఆటవస్తువులు, ఓపెన్ జిమ్ వస్తువుల మరమ్మతులు ఇంజనీరింగ్ విభాగం అధికారుల పరిధిలోకి వస్తుంది. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఫిర్యాదు చేశాం. త్వరలోనే ఆట వస్తువులు, ఓపెన్ జిమ్‌లోని పరికరాల మరమ్మతుకు వెంటనే చర్యలు తీసుకుంటాం.

- ఆశిష్, ఇందిరాపార్కు, మేనేజర్



మరమ్మతులు చేయాలి



ఇందిరాపార్కులో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు, యువత, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు విరిగిపోవడంతో చిన్నారులు, యువత, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పార్కులో ఉన్న ఆట పరికరాలకు మరమ్మతులు చేపట్టి చిన్నారులకు అందుబాటులోకి తీసుకురావాలి. అదేవిధంగా యువత, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టాలి

- ఎ.ప్రభాకర్ గంగపుత్ర, దోమలగూడ నివాసి

సమస్య పరిష్కారానికి కృషి చేస్తా



ఇందిరాపార్కులో చిన్నారులు ఆడుకునే ఆటపరికరాలు, యువత, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్ పరికరాలు పనిచేసే విధంగా జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికెళ్లి సమస్యను పరిష్కరిస్తాను. నగరంలోనే ప్రసిద్ధిగాంచిన ఇందిరాపార్కులో ఎలాంటి సమస్యలు లేకుండా కృషిచేస్తా. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి

- జి రచనశ్రీ, కార్పొరేటర్



మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ డాక్టర్ బాబురావు

ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సాగులో ఉన్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ ఆదివాసీ గిరిగిజన సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పూసం సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో బాబురావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ములుగు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఎస్టీ కోయ ఆదివాసీలకు గొత్తికోయ వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని, పుట్టుకతో ఆదివాసీలైనప్పటికీ ఎలాంటి ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆయన వాపోయారు. తునికాకు కట్ట 5 రూపాయలుగా నిర్ణయించాలని ఆయన కోరారు. జీవో 3 పునరుద్ధరణ కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, లంక రాఘవులు. ఎ రామపున్నం, సహాయ కార్యదర్శులు పోలెం రాజేందర్, కారెం పుల్లయ్య, తోట శ్రీనివాస్, జి రాజేష్, టి శంభు, రాష్ట్ర కమిటీ సభ్యులు కె మాలశ్రీ పాల్గొన్నారు.

నాలాలో పేరుకుపోయిన చెత్తలో మంటలు



నాలాలోని పైపులైన్ వద్ద కాలుతున్న చెత్త

గోల్నాక, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గోల్నాక శాంతినగర్ బస్తీని ఆనుకుని పారుతున్న హుస్సేన్‌సాగర్ వరదనీటి నాలాలో పేరుకుపోయిన చెత్తలో మంటలు ఎగిసిపడ్డాయి. మంగళవారం మధ్యాహ్నం నాలాలో చెత్త నుంచి ఒకసారిగా మంటలు రావడంతో పెద్దఎత్తున పొగ వ్యాపించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నాలాలో పేరుకుపోయిన చెత్తలో గుర్తు తెలియని ఆకతాయిలు మంట పెట్టడంతో అది పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. ఫైరింజన్ వచ్చేలోగానే స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఒక ఇల్లు కొంతమేర కాలిపోయింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. శివం 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని టీఆర్‌టీ క్వార్టర్స్, విద్యానగర్ రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, ఏసీ గార్డ్స్, లుంబినీ పార్కు పరిధిలోని పలు ప్రాంతాల్లో 10 నుంచి 1 గంట వరకు, ఇందిరాపార్కు, విఠల్‌వాడి పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బస్తీనాయకులు

ప్రభుత్వ ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలి

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సబర్మతినగర్‌లోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలని కోరుతూ బస్తీవాసులు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌ను ఆమె ఆఫీసులో కలిసి వినతిపత్రం మంగళవారం సమర్పించారు. గతంలో ఉన్న సబర్మతినగర్ కమ్యూనిటీహాల్‌ను అశోక్‌నగర్ నాలా విస్తరణ, నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణం సమయంలో మున్సిపల్ ఇరిగేషన్ విభాగం అధికారులు కూల్చివేశారని, ఆ స్థలంలోనే బస్తీవాసుల అవసరాల మేరకు కమ్యూనిటీహాల్ నిర్మించి ఇవ్వాలని సబర్మతినగర్‌వాసులు, నాయకులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సబర్మతినగర్ బస్తీ నాయకులు కె.నర్సింగ్‌రావు, జి.నర్సింగ్‌రావు, ఎండి గౌస్, లక్ష్మయ్య, ఎం.ఉమేష్, డి.కుమార్, టి.యాదగిరి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయిం ట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కొలకలూరి ఇనాక్ తదితరులు

చిత్రకళలో ప్రయోగాలు చేసిన దామెర్ల

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రాంతాల్లో ఆధునిక చిత్రకళకు మార్గదర్శి దామెర్ల రామారావు అని శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం దామెర్ల రామారావు యాదిలో పేరిట సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొలకలూరి ఇనాక్ హాజరై మాట్లాడుతూ.. రాజమండ్రిలో జన్మించిన రామారావు చిత్రకళలో పలు ప్రయోగాలు చేశారన్నారు. ఆయన సృజించిన చిత్రకళ దామెర్లశైలిగా గుర్తింపు పొందిందన్నారు. ప్రాంతీయతను ప్రతిబింబించిన కార్తీకపౌర్ణమి, తూర్పు కనుమల గోదావరి వంటి చిత్రాలు ప్రసిద్ధమైనవన్నారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ రాజమండ్రిలో రామారావు చిత్రకళాప్రదర్శనశాలను ఆనాడు మహాత్మాగాంధీ ప్రారంభించారన్నారు. సంఘసేవకులు సత్యనారాయణమూర్తి, గాయకులు శికుమార్, గాయని ఉష తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పశువైద్యాధికారుల సంఘం నేతలు

తెలంగాణ రాష్ట్రానికి బెస్ట్ పెర్‌ఫార్మింగ్ స్టేట్ అవార్డు

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం విషయంలో దేశంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన సందర్భంగా గాను తెలంగాణ రాష్ట్రానికి బెస్ట్ పెర్‌ఫార్మింగ్ స్టేట్ అవార్డు రావడానికి కృషి చేసిన తెలంగాణ పశుసంవర్ధకశాఖ అదనపు సంచాలకులు డా. మల్లీశ్వరి, వారి సిబ్బంది డా. పాశం శ్రీనివాస్‌రెడ్డి, డా. నిశ్చలను మంగళవారం తెలంగాణ పశు వైద్యాధికారుల సంఘం అభినందించింది. ఈసందర్భంగా తెలంగాణ పశు వైద్యాధికారుల సంఘం అధ్యక్షులు డా. ఎం రమేష్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి బెస్ట్ పెర్‌ఫార్మింగ్ స్టేట్ అవార్డు రావడానికి కృషి చేసిన వారందరికి అసోసియేషన్ తరఫున అభినందనలు తెలిపారు. నాగయ్య, శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్ వర్మ, రామారావు, సంజయ్ తదితర డాక్టర్లు పాల్గొన్నారు.

'సమాజంలో మానవతా విలువలు పెంచాలి'

చిక్కడపల్లి: సమాజంలో మానవతా విలువలు పెంపొందించాలని ప్రముఖ గాయని, శ్రుతిలయ ఆర్ట్స్ అధినేత్రి ఆమని అన్నారు. ఏఆర్ఎమ్ మ్యూజికల్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో నిండు నూరేళ్ల సావాసం పేరిట సినీసంగీత విభావరి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమని గాయనీగాయకులను అభినందించారు.

ఎన్టీఆర్, ఘంటసాల విశిష్ట వ్యక్తులు

చిక్కడపల్లి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నటుడుగా ఎన్టీఆర్, గాయకుడుగా ఘంటసాల విశిష్టత ఎంతో గొప్పదని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ డీజీఎం వి.సతీష్ అన్నారు. త్యాగరాయ గానసభలో మంగళవారం అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కనులు మాటలాడునని శీర్షికతో ఘంటసాల గానవిభావరి జరిగింది. అర్చన వెంకటేశ్వరరావు, లలిత, టీవీ రావు, లలితారావు, రామలక్ష్మి, జ్యోతిర్లత, శారద, మూర్తి, డిఎస్ఎన్ మూర్తి, శేఖర్ పాటలు ఆలపించారు. పీసపాటి శేఖరుడు వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఉదయ్‌కుమార్ ట్రాక్ సహకారం అందించారు. ఇన్సూరెన్స్ కంపెనీ విశ్రాంత అధికారి కెప్రకాష్‌రావు, ఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రసీమలో ఎన్టీఆర్ పేరు చిరస్మరణీయం

చిత్రసీమలో ఎన్టీఆర్ పేరు చిరస్మరణీయంగా నిలిచి ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో ఎన్టీఆర్ పాటకు పట్టాభిషేకం పేరిట సినీ సంగీత విభావరి జరిగింది. ఈ సందర్భంగా గాయకులు వీఆర్‌కె ఫణి, కరవోకే సహకరించిన హృషికేశ్, గాయని పి.అనంతలక్ష్మిలను సన్మానించిన రేలంగి నరసింహారావు మాట్లాడుతూ గాయనీగాయకులను అభినందించారు. వంశీసంస్థల వ్యవస్థాపకులు డా.వంశీ రామరాజు, శైలజ పాల్గొన్నారు.

'సంవిధాన్ గౌరవ్ అభియాన్‌ను విజయవంతం చేయాలి'

అంబర్‌పేట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అంబర్‌పేట డివిజన్‌లో సంవిధాన్ గౌరవ్ అభియాన్‌ను విజయవంతం చేయాలని డివిజన్ బీజేపీ నేతలు నిర్ణయించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు టి.నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ అంబర్‌పేట డివిజన్ కార్యకర్తల సమావేశం జరిగింది. సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు రాజ్యాంగం పట్ల అవగాహన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, అంబర్‌పేట డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు దాసోజు నాగభూషణంచారి, నాయకులు వెంకటస్వామిగౌడ్, యశ్వంత్, మాణిక్ ప్రభు ముదిరాజ్, ఆర్.కృష్ణ ముదిరాజు, మైలారం రాజు, దయాకర్‌యాదవ్, పెంటంరాజు, రత్నప్రభ, సరోజమ్మ, వర్కాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, జనవరి21 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కాచిగూడ డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో మంచినీటి పైప్‌లైన్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని విక్రమ్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, అప్పటి జనాభాకు అనుగుణంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లు ప్రస్తుత జనాభాకు సరిపోకపోవడంతో తరుచూ సమస్యలు వస్తున్నాయని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ బావన, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్వీర్, క్షీరసాగర్, బీంరాజ్, ఆర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఉపాధి శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న కావ్య కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): యువతులు, మహిళలు ఏబీవీ ఫౌండేషన్ ద్వారా ఇస్తున్న ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్యాకిషన్ రెడ్డి కోరారు. మంగళవారం బర్కత్‌పుర బీజేపీ నగర కార్యాలయంలో అటల్‌బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ స్కిల్స్ సెంటర్‌లో శిక్షణ పొందినమహిళలకు సర్టిఫికెట్లను బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావుతో కలిసి ప్రదానం చేశారు. పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో 16 సెంటర్లు ప్రస్తుతం స్కిల్స్ లో శిక్షణ ఇస్తున్నాయని, ఆరు సెంటర్లలో 350 మంది విద్యార్థులు శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో మరికొన్ని కొత్త సెంటర్లను ఏర్పా టు చేస్తున్నామని, కుట్టుశిక్షణతో పాటు కంప్యూటర్ కోర్సుల్లోనూ శిక్షణ ఇస్తున్నామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జిల్లా అధికారి ప్రతినిధి చిట్టి శ్రీధర్, ఏబీవీ ఫౌండేషన్ స్కిల్ సెంటర్ కో ఆర్డినేటర్ నీరజ, ట్యూటర్స్ వనజ, రమ, అశ్విని, మౌనిక, సరస్వతి, ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు చేయాలి

అంబర్‌పేట, జనవరి21 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో వీధిలైట్లకు మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జంటనగరాల పరిధిలో వీధిలైట్లను ఈఈఎస్ఎల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నదని, మూడు నెలలుగా నగరంలో ఎక్కడ వీధి దీపాలు వెలగకపోయినా ఏజెన్సీ స్పందించడం లేదని ఆరోపించారు. ప్రజలు ఏజెన్సీ వారిని అడిగితే ప్రభుత్వం డబ్బులు ఇవ్వడం లేదని, అందుకే తాము పని చేయడం లేదని చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

'పెన్షన్ రూ.9 వేలకు పెంచాలి '

బర్కత్‌పుర, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వివిఎస్‌రావు భూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం బర్కత్‌పురలోని పీఎఫ్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పీఎఫ్ అనుబంధ స్కీమ్‌ల అమలులో వస్తున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కార్మికుల కేవైసీ పూర్తి చేసి సహకరించాలని, అనవసరమైన కారణాలతో రిజక్ట్ చేయవద్దని వారు డిమాండ్ చేశారు. హైయ్యర్ పెన్షన్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోర్టు తీర్పు ప్రకారం జాయింట్ డిక్లరేషన్ ఇచ్చిన వారికి తక్షణమే డిమాండ్ నోటీసులు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీఎఫ్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు.

ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.2 లక్షల సాయం: అరవింద్‌కుమార్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్‌గౌడ్

కవాడిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు పేరుతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టుకు తన వంతు సాయంగా 2 లక్షలా 11 వేలా 116 రూపాయలను విరాళంగా అందజేసినట్లు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు అరవింద్‌కుమార్ వెల్లడించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని కలిసి ఈ విరాళాన్ని అందజేసినట్లు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత రెండున్నర దశాబ్దాలుగా ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, బ్లడ్‌బ్యాంక్, తలసీమియా బాధితులకు ఉచితంగా రక్తమార్పిడి, ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ద్వారా పేదలకు ఉచిత విద్య, ఆర్థికంగా వెనకబడిన వారికి స్వయంఉపాధి పొందడానికి సాధికారిత, జీవనోపాధి కల్పించడం ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం ట్రస్టు లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ట్రస్టు నిర్వహించే ప్రతీ కార్యక్రమం పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) నేతలు ప్రదీప్‌సింగ్ ఠాకూర్ తదితరులు

కవాడిగూడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్క్సిస్టు మహోపాధ్యాయులు, లెనిన్ శతవర్ధంతి ముగింపు సభ మంగళవారం నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) జాతీయ కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఠాకూర్, సీనియర్ నాయకులు కెచ్చెల రంగయ్య, కె.జి.రాంచందర్, వి.కృష్ణ, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య తదితరులు హాజరై మాట్లాడారు. వంద సంవత్సరాలు పూర్తయినా నేటికీ లెనిన్ రచనలు అనుసరణీయమైనవని అన్నారు. కారల్ మార్క్స్ సృష్టించిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలో నిరూపించిన సోషలిస్టు సమాజాన్ని నిర్మించిన మహాయోధుడు లెనిన్ అని వారు కొనియాడారు. ఈ సందర్భంగా లెనిన్ రచించిన పలు పుస్తకాలలోని వివిధ అంశాలపై ఎల్.ఎల్.పద్మ, వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, జి.భార్గవ, ఎం.కృష్ణ, కె.సూర్యంలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎం.హన్మేష్, వి.ప్రభాకర్, సదానం, బి.రాము, ఆవుల అశోక్, జి.రామయ్య, సి.వై.పుల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జనక్‌ప్రసాద్, శ్యామ్‌సుందర్‌జాజు

కార్మికుల వేతనాల పెంపు కోసం ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది

చిక్కడపల్లి: కార్మికుల వేతనాల పెంపుకోసం ప్రభుత్వం అధ్యయనం చేస్తోందని కార్మికశాఖ కనీస వేతనాల సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మికశాఖ కమిషనరేట్‌లో మంగళవారం కనీస వేతన సలహామండలి సమావేశం లో ఆయన మాట్లాడారు. కార్మికులకు మెరుగైన జీతాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు ఆమోదంతో కార్మికులకు ఆమోదయోగ్యమైన వేతన పెంపు ఉంటుందన్నారు. మండలి కార్యదర్శి శ్యామ్‌సుందర్‌జాజు, సభ్యులు యూసుఫ్, రాజుముదిరాజ్, మీలా జయదేవ్ పాల్గొన్నారు.

కొనసా..గుతున్న రేషన్‌కార్డుల సర్వే



ముషీరాబాద్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారిణి

ముషీరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం చేసిన దరఖాస్తుల సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. జీహెచ్ఎంసీతో పాటు సివిల్ సప్లై, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. మంగళవారంతో సర్వేను పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లినప్పటికి నేటికీ పూర్తి కాలేదు.

డివిజన్ల వారీగా బృందాలు

ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో సర్వే నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో డివిజన్‌కు రెండు నుంచి మూడు టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క టీమ్‌లో ముగ్గురు నుంచి నలుగురు సర్వే నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ అనుకున్న సమయానికి సర్వే పూర్తి కాలేదు. నియోజకవర్గంలో 1,845 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులు అందరి వివరాలు సేకరించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

దరఖాస్తుదారుల ఆందోళన

రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన, ప్రజావాణి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొంత మందికి నేటికీ సర్వే జరగకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తమ ఇంటికి అధికారులు రాలేదని, తమ వద్ద వివరాలు సేకరించలేదని, తమకు రేషన్‌కార్డు వస్తుందా లేదా అని ఆందోళన చెందుతున్నారు.

అర్హులందరికీ తెల్లరేషన్‌కార్డులు

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో అర్హులందరికీ తెల్లరేషన్‌కార్డులు అందించాలని బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.యశ్వంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ప్రజలు తెల్లరేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. తూతూమంత్రంగా అరకొర కార్డులు జారీ చేసి సర్వర్ బంద్ అయిందని మూసివేస్తే బీజేపీ పేదల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. అంబర్‌పేట డివిజన్‌లో పేదలు ఎక్కువగా ఉన్నారని, అర్హులైన వారికి తెల్లరేషన్ కార్డులు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.